క్లుప్తంగా

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు టెక్నికల్ ఆఫీసర్‌గా దత్తాత్రేయ



చార్మినార్: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వ పథకం కింద 2023 ఫిబ్రవరి 2 నుంచి 9వ తేదీ వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్వాలిఫైడ్ కమిషనర్ కె.దత్తాత్రేయ సాంకేతిక అధికారిగా నియమితులయ్యారు. ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు న్యూఢిల్లీలోని ఐజీ స్టేడియంలో, 8, 9వ తేదీల్లో మధ్యప్రదేశ్ జబల్పూర్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు దత్తాత్రేయ టెక్నికల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు.

దేవర కరుణాకర్‌కు ఘన నివాళి



దేవర కరుణాకర్‌కు నివాళులర్పిస్తున్న అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: ప్రజాసేవ కోసం పాటుపడిన నాయకుడు దివంగత దేవర కరుణాకర్ అని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. మంగళవారం గుడిమల్కాపూర్ డివిజన్‌లోని మోహిని ఫంక్షన్‌హాల్‌లో దేవర కరుణాకర్ సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులతో కలిసి దేవర కరుణాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దఫాలుగా కార్పొరేటర్‌గా పని చేసిన దేవర కరుణాకర్ ఎప్పుడూ ప్రజల వెంటే ఉంటూ అభివృద్ధి పనులు చేయించారన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బద్దం మహిపాల్ రెడ్డి, డిజ్వర్ సింగ్, ఠాకూర్ యోగిరాజ్ సింగ్, ఇంద్రసేనారెడ్డి, నాగ ప్రకాశ్ రెడ్డి, పూర్ణచందర్, కరుణాకర్ కుటుంబ సభ్యులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ తదితరులున్నారు.

దళిత ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు కృషి



రాజు వస్తాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తమ హక్కుల సాధనకు దళిత సంఘాలు ముందుకు రావాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రాజు వస్తాద్ అన్నారు. 5 సంఘాల కలిసి ఆయనను ఏకగ్రీవంగా జాయింట్ యాక్షన్ చైర్మన్‌గా ఎన్నుకున్న సందర్భంగా మంగళవారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు భూమయ్య, ప్రధాన కార్యదర్శులు డీఆర్.శ్రీనివాస్, విశ్వనాథం, రామస్వామి, రాందాసు, శంకర్ తదితరులున్నారు.

గోవులను సంరక్షించిన గో రక్షాదళ్ సభ్యులు

అబిడ్స్: గోవధ శాలలకు తరలిస్తున్న గోవులను గో రక్షాదళ్ సభ్యులు సంరక్షించారు. టీటీడీ గో రక్షాదళ్ సభ్యుడు కోటి శ్రీధర్, గో రక్షాదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాలుసింగ్, గో జ్ఞాన్ ఫౌండేషన్ సభ్యులు నితేష్, విజయవర్గి, గో రక్షాదళ్ ప్రధాన కార్యదర్శి పవన్ రెడ్డి, శంకర్‌యాదవ్ గోవధకు తరలిస్తున్న కంటైనర్‌ను అడ్డుకున్నారు. అందులో ఉన్న 37 గోవులను రక్షించి ఘట్కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కోటి శ్రీధర్ తెలిపారు. గోవులను తరలిస్తున్నవారిపై పోలీసులు కేసులు నమోదు చేశారని ఆయన వివరించారు. టీటీడీ గో రక్షాదళ్ ఆధ్వర్యంలో నిరంతరం గో ఉత్పత్తులు పెంపొందించేందుకు, గోవులను సంరక్షించేందుకు కృషిచేస్తున్నట్లు కోటి శ్రీధర్ పేర్కొన్నారు.

ఎగ్జిబిషన్‌లో చిల్డ్రన్స్ డే



గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జరుగుతున్న 82వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) సందర్శకులతో కిటకిటలాడుతుంది. ఈ సందర్భంగా మంగళవారం ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు చిల్డ్రన్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేవలం పిల్లలకు మాత్రమే ప్రవేశం కల్పించగా చిన్నారుల కోసం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు అశ్విన్ మార్గం, కార్యదర్శి సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కౌసర్



చెక్కును అందజేస్తున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఈ పథకాల వల్ల వేల సంఖ్యలో అమ్మాయిల వివాహాలు జరిగాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ తాను ఈ పథకం ద్వారా ఆర్థిక లబ్ధి చేకూరేలా చూశానన్నారు. పలువురు అక్రమార్కులు తాము డబ్బులు ఇప్పిస్తామంటూ పలువురిని మోసం చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

జోనల్ కమిషనర్‌తో సమావేశం...

కార్వాన్ నియోజకవర్గంలో మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ బల్దియా జోనల్ కమిషనర్‌ను కోరారు. మంగళవారం సాయంత్రం ఆయన బల్దియా జోనల్ కమిషనర్ రవి కిరణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కార్వాన్ నియోజకవర్గంలో ఆమోదం చెందిన పనులను వెంటనే చేపట్టాలని కోరారు. రంజాన్ మాసం రానుందని, అంతకంటే ముందే ఆయా ప్రాంతాల్లో అవసరం అయిన పనులను పూర్తి చేయాలని కోరారు.

క్రీడా మైదానం ప్రారంభం



చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న సీపీ సీవీ ఆనంద్

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో వందేళ్లుగా శారదా విద్యాలయ కొనసాగుతుండడం గొప్ప విషయమని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. శారద విద్యాలయ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని మంగళవారం ఆయన భారత టెస్ట్ క్రికెటర్ వెంకటపతి రాజు, ఏంజెల్ ఇన్వెస్టర్, నోహ్ సాఫ్ట్ వ్యవస్థాపకులు మైనేనీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేజీ నుంచి పీజీ వరకు వేల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించిన ఘనత శారదా విద్యాలయకు దక్కుతుందన్నారు. 1922లో ఫౌండర్ సత్యనారాయణ స్థాపించిన విద్యాలయ హైస్కూల్ భవనాన్ని 1962లో భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ప్రారంభించడం సంతోషకరమైన విషయమన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను వారు తిలకించారు. ఈ కార్యక్రమంలో శారదా విద్యాలయ ట్రస్టీ, సింథోకెమ్ ల్యాబ్స్ చైర్మన్ జయంత్ ఠాగోర్, కార్యదర్శి రామ్ మాది రెడ్డి, కరస్పాండెంట్ జ్యోత్స్న అంగారా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సాంబ లలిత పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న డీసీపీ పరవస్తు మధుకర్‌స్వామి తదితరులు

అబిడ్స్: పోలీసు జాబ్‌ల కోసం ప్రిపేయిర్ అవుతున్న అభ్యర్థులకు పరవస్తు క్రియేటీవ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ గ్రీండ్ ల్యాండ్స్‌ల ఆధ్వర్యంలో ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేశారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్సై పోస్టుల కోసం ప్రిపేయిర్ అవుతున్న దాదాపు 150 మందికి సీతారామ్‌బాగ్‌లోని డాక్టర్ ఈశ్వర్‌చందర్ హెల్త్ సెంటర్ కార్యాలయంలో ఈ స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. డీసీపీ పరవస్తు మధుకర్ స్వామి స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేసి ప్రసంగించారు. పోలీసు జాబ్‌ల కోసం ప్రిపేయిర్ అవుతున్న అభ్యర్థులకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



సినీ నటి సోహా అలీ ఖాన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రెడ్ రోజ్ మార్ట్ ప్రతినిధులు

చార్మినార్: అంతర్జాతీయ ప్రమాణాలతో ఫలక్‌నుమాలో ఏర్పాటు చేసిన రెడ్ రోజ్ మార్ట్‌కు రెండో వార్షిక వరల్డ్ సిగ్నేచర్ అవార్డు–2022 లభించిందని రెడ్‌రోజ్ గ్రూపు కంపెనీ చైర్మన్ సయ్యద్ హమీదుద్దీన్ తెలిపారు. వెల్ డిజైన్డ్ సూపర్ మార్కెట్ ఆఫ్ ది ఇయర్ (హైదరాబాద్) క్యాటగిరిలో తమకు ఈ అవార్డు లభించిందని గోవాలోని నోవాటెల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రెడ్ రోజ్ మార్ట్ సీఈఓ జియా ఉర్ రెహమాన్, మేనేజింగ్ డైరెక్టర్ జీషానుద్దీన్ ప్రముఖ బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్ చేతుల మీదుగా అందుకున్నారన్నారు.

యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలి



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర

గౌలిపురా: నేటి యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర అన్నారు. ఓంకార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం టైగర్ ఆలే నరేంద్ర మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలు జరిగాయి. ఈ ఫైనల్ పోటీల్లో 333 జట్టు, పార్వతీ నగర్ జట్టులు తలపడగా.. 333 జట్టు విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన జట్టుకు మాజీ కార్పొరేటర్ జితేంద్ర రూ.5 వేలు, ట్రోఫీని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత పాశ్చాత్య పోకడలకు దూరంగా ఉంటూ దేహ దారుఢ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.పి.సురేశ్ కుమార్, ఆదర్శ మహేశ్, డొంకి యాదగిరి, ఇ.సుమన్‌కుమార్ ముదిరాజ్, సి.నితీష్, హరీష్, సునిల్, సంతోష్, రోహిత్, జమాల్‌పూర్ అశోక్, బాబు, డాక్టర్ విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలంగాణ రాష్ట్ర ఖనిజ వనరుల అభివృద్ధి చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. మంగళవారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు ఇతర రంగాల్లోనూ రాణించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అదేవిధంగా మాయా పేటిక చిత్రబృందం సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలువలను నేర్పించాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో పిల్లలకు విజయం కన్నా విలువలు ఎంతో గొప్పవని తెలియజేయాల్సిన అవసరం ఉందని పద్మభూషన్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ 3వ వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి సమాజ నిర్మాణం కావాలంటే విద్యా వ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువతలో మార్పు కోసం సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఈదా శాముల్‌రెడ్డి, డైరెక్టర్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



గౌలిపురా: రౌడీషీటర్లు నేరాలకు దూరంగా ఉంటూ సమాజంలో మంచి వ్యక్తులుగా మెలగాలని భవానీ నగర్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ అంజద్ అలీ సూచించారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు మంగళవారం ఆయన స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్పడకూడదన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేకు ఆహ్వానం అందజేస్తున్న ఆర్ఎస్‌కేఎస్‌పీ ఫౌండర్ కరాటే లక్ష్మీ సామ్రాజ్యం, మెట్టు వెంకటేష్

అబిడ్స్: 3వ జాతీయ ఓపెన్ కరాటే కుంగ్ ఫూ ఆల్ స్టైల్ చాంపియన్‌షిప్ 2023 పోటీలకు నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ మేరాజ్‌కు ఆహ్వానం అందజేశారు. ఆర్ఎస్‌కేఎస్‌పీ ఆధ్వర్యంలో ఎల్బీస్టేడియంలో ఫిబ్రవరి 5న ఈ పోటీలు ప్రారంభమవుతాయి. కార్యక్రమంలో నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఉపాధ్యక్షులు మెట్టు వెంకటేష్, కరాటే లక్ష్మీ సామ్రాజ్యం పాల్గొన్నారు.

అభినందనలు



నేషనల్ కరాటే పోటీలకు ఎన్నికైన విద్యార్థులతో కేటీఎస్ ప్రిన్సిపాల్ బెన్ని

జియాగూడ: నేషనల్ కరాటే దో చాంపియన్‌షిప్ 2023 8 వ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పూరాణాపూల్ రహీంపురా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభ చాటారని పూరాణాపూల్ రహీంపురా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ బెన్ని అన్నారు. ఈ మేరకు కేటీఎస్ స్కూల్‌కు చెందిన 8వ తరగతి ప్రీతిసింగ్, 9వ తరగతి సంజన, 4వ తరగతి వేదికలను విజయం సాధించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా బెన్ని మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో జరిగే కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో గెలుపొందేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు.

'9, 10 తరగతులను బహిష్కరించండి'

అఫ్జల్‌గంజ్: ఉన్నత పాఠశాలల్లో భాషా విద్యాను బోధిస్తున్న భాషోపాధ్యాయులు ఈనెల 1 నుంచి 9, 10 తరగతులను బహిష్కరించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు పండితులు డాక్టర్ ఎస్ విజయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహా సభల్లో తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి సాక్షిగా ప్రపంచ తెలుగు ప్రతినిధుల ముందు హామీ ఇచ్చి ఐదేళ్లు గడిచినా అమలుకు నోచుకోకపోవడంతో భాషా పండితులు నిరాశ, నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌లకు సమానంగా పనిచేస్తూ ఎస్జీటీ ఉపాధ్యాయుల జీతాలు తీసుకుంటూ వెట్టి చాకిరి, శ్రమదోపిడితో ఉన్నారని ఆయన తెలిపారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ నమోదు

బహదూర్‌పురా: కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన మహమ్మద్ అర్బాజ్ (21)పై కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌తో పాటు పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు కాలాపత్తర్ పోలీసులు రౌడీషీటర్ మహమ్మద్ అర్బాజ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

డబీర్‌పురా: కూరగాయల కోసం వచ్చిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునివ్వడంతో మీర్‌చౌక్ పోలీసులకు జైలుకు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లో మహమ్మద్ జావీద్ (22) కూరగాయల వ్యాపారం నిర్వహిస్తుంటాడు. కూరగాయల కోసం వచ్చిన ఓ మహిళ పట్ల వ్యాపారి మహ్మద్ జావీద్ అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా నిందితునికి కోర్టు 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది.

యువకుడి అదృశ్యం



మహ్మద్ ఇస్మాయిల్

చాంద్రాయణగుట్ట: యువకుడు అదృశ్యమైన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. నవాబుసాహెబ్‌కుంటకు చెందిన మహ్మద్ కాసీం కుమారుడు మహ్మద్ ఇస్మాయిల్(23) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. రోజు మాదిరిగానే జనవరి 27న మధ్యాహ్నం డ్యూటీకి వెళ్లిన ఇస్మాయిల్ రాత్రి వరకు కూడా ఇంటికి రాలేదు. అతనికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ విషయమై అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో గాని 8712660379లో గాని సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

హోంమంత్రికి సత్కారం



హోంమంత్రిని సత్కరిస్తున్న దీపాంకర్ పాల్

చార్మినార్: కాళిమాత ఆలయం తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్యఅతిథిగా హాజరైన హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీకి హైదరాబాదీ బెంగాలీ అసోసియేషన్ వ్యవస్థాపకులు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు దీపాంకర్ పాల్ ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సలావుద్దీన్ లోధి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే ధ్యేయం



భగవాన్‌దాస్ బాడలో నాల్గవ విడత దళితవాడలో బస యాత్ర

అబిడ్స్: జాంబాగ్ డివిజన్‌లోని భగవాన్ దాస్ బడాలో నాల్గవ విడత బస యాత్రను గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, బీఆర్ఎస్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ బస యాత్రలో తమ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడంతో పాటు నిరుద్యోగులకు అవకాశాల కల్పన ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామన్నారు. భగవనాదాస్, బడా బస్తీ అధ్యక్షులు రాజు ముదిరాజ్, లక్ష్మణ్, డి.మల్లికార్జున్, జి.వెంకటేష్, రాకేష్, జైశంకర్, సతీష్, ఎమ్మార్పీఎస్ నాయకులు రవి మాదిగ, ఎస్.కె.శ్రీనివాస్ మాదిగ, అనిల్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



సంత్ రాహుల్ దాస్ మహరాజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సాయిబాబాచారి తదితరులు

గోల్కొండ: గోల్కొండ కోటపై కొలువుదీరిన శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. లంగర్‌హౌస్‌లోని సంఘం మఠం పీఠాధిపతి రాహుల్‌దాస్ మహరాజ్ ఈ పూజల్లో పాల్గొన్నారు. గోల్కొండ కోటలో కొలువుదీరిన అమ్మవార్లకు ఎంతో ఘనమైన చరిత్ర ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యేది గోల్కొండ కోటలోనని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవార్ల వృత్తి పని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి ఆయనకు అమ్మవార్ల ఫొటో గల జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహంకాళి ఆలయ పూజారి సురేష్ చారి, శ్రీకాంత్ చారి పాల్గొన్నారు.

కేలండర్ల ఆవిష్కరణ

నాంపల్లి: తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర నూతన కేలండర్ ఆవిష్కరణ మంగళవారం రాత్రి తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హాజరై కేలండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు. టీజీఓ రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీఓ కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, కార్యదర్శి రాయకంటి ప్రతాప్, టీజీఓ నగర శాఖ అధ్యక్షుడు డాక్టర్ గండూరి వెంకటేశ్వర్లు, టీజీఓ హైదరాబాదు జిల్లా అధ్యక్షుడు ఎంబి.కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

అబిడ్స్: మెట్రో వాటర్‌బోర్డు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ 2023 నూతన కేలండర్‌ను వాటర్ బోర్డు ఎండీ దానకిశోర్ ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.లక్ష్మీనారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్ నర్సింగ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.అశోక్, వైస్ చైర్మన్ శంకర్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి డి.అశోక్, సత్యనారాయణ, ఉదయ్‌కుమార్, రమేష్ బాబు, మొగులయ్య, కృపరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కార్మికులకు సంబంధించిన పలు రకాల సమస్యలను పరిష్కరించాలని బోర్డు ఎండీ దానకిశోర్‌కు వినతిపత్రం అందజేశారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎండీ దానకిశోర్, లక్ష్మీనారాయణ, అశోక్ తదితరులు

కొనసాగుతున్న ఉర్సు

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ హజ్రత్ మౌలానా సిద్దిఖ్ దిన్దార్ చన్న బసవేశ్వరుల వారి దర్గాలో ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న సర్వ ధర్మ సమ్మేళన కార్యక్రమంలో అన్ని మతాల నుంచి పండితులు, పాస్టర్లు, సిక్కులు, జైనులు, పార్శీయులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. 1924వ సంవత్సరం నుంచి ఈ సర్వ ధర్మ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో ప్రత్యేకంగా సర్వమత పెద్దలు పాల్గొని ప్రపంచ శాంతి సందేశాలను ఇస్తున్నారు. ఈ ఉర్సు వేడుకలు నేటితో ముగుస్తాయి.

మహిళా డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసులు దాసు

గోల్కొండ: మాదక ద్రవ్యాల సరఫరా, కొనుగోళ్లలో దుండగులు కళాశాల అమ్మాయిలను కూడా ఉపయోగించుకుంటున్నారని గోల్కొండ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌దాస్ అన్నారు. మాదక ద్రవ్యాల నిషేధంపై గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాదక ద్రవ్యాల వాడకం, అమ్మడంపై నిషేధం ఉందని ఆయన స్పష్టం చేశారు. మాదక ద్రవ్యాల సరఫరాలో దుండగులు ఎప్పటికప్పుడు తమ పంథాను మార్చుకుంటూ డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నారన్నారు. అయితే వారి ఎత్తుగడలను పోలీసులు ఎప్పటికప్పుడు కనిపెడుతూ వారిని పట్టుకుంటున్నారని ఆయన అన్నారు. అయితే మాదక ద్రవ్యాలను అక్రమంగా సరఫరా చేసే వారు మహిళలు, ముఖ్యంగా కళాశాల విద్యార్థులకు డబ్బు ఆశ చూపించి మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకంలో వారిని ఉపయోగించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కమిటీ చైర్మన్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరాజు, సభ్యులు ప్రొఫెసర్ హుస్సేన్, డాక్టర్ బాలా శ్రీనివాస్, గంగాధర్, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



సుబ్బరాజును సన్మానించిన దృశ్యం

గోల్కొండ: ఆలయాల అభివృద్ధికి దాతలు సహకరిస్తున్న తీరు అభినందనీయమని నానల్‌నగర్ తిరుపల్లిగడ్డలోని శ్రీ కోవెల రంగనాయకస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఈ. శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ కోవెలం రంగనాయకస్వామి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉందని, ఈ ఆలయానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఆలయ అభివృద్ధికి కమిటీ వారు చేస్తున్న కృషికి దేవాదాయశాఖ తరఫు నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటున్నాయని ఆయన అన్నారు. ఈ ప్రత్యేక పూజలకు హాజరైన గ్రీన్ సిటీ ఎస్టేట్స్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సుబ్బరాజు ఆలయ అభివృద్ధికి తనవంతు సాయం చేస్తానన్నారు. అనంతరం సుబ్బరాజును ఆలయ ఈఓ శాలువా కప్పి సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు సోమరాజు జనార్దన్, నర్సింహ, అశోక్‌కుమార్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఫలక్‌నుమా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. షాజహాన్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు. జీఎం చావునీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు. షేక్ కీ మసీదు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.